సాక్షి అనకాపల్లి

బుధవారం ı 6 ı డిసెంబర్ ı 2023



9న మెగా లోక్ అదాలత్

9న జరిగే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని విశాఖజిల్లా ప్రధాన న్యాయమూర్తి గిరిధర్ పిలుపునిచ్చారు. 8లో



8న మేరీమాత పండగ

విశాఖలోని పాత పోస్టాఫీస్ వద్ద గల కొండగుడి విశాఖపురి మేరిమాత పండగను ఈనెల 8వ తేదీన నిర్వహించనున్నారు. 8లో

వాతావరణం

అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజులు వాతావరణం మేఘావృతమై వర్షాలు పడే అవకాశం ఉందని ఆర్ఏఆర్ఎస్ వాతావరణ శాస్త్రవేత్త ఎంబీజీఎస్ కుమారి మంగళవారం తెలిపారు. ఉష్ణోగ్రతలు 22.8 నుంచి 30.5 డిగ్రీలు, గాలిలో తేమ 78–98 శాతం, గాలి గంటకు 9–18 కి.మీ. వేగంతో వీచే అవకాశం ఉందన్నారు.

న్యూస్‌రీల్

ముందస్తుగా ఆస్పత్రులకు గర్భిణుల తరలింపు



రావికమతంలో గర్భిణిని 108లో అనకాపల్లి ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

రావికమతం: తుపాను నేపథ్యంలో గర్భిణులను ముందస్తుగా ఆస్పత్రులకు తరలిస్తున్నారు. ఈ నెల 10వ తేదీలోగా డెలివరీ అయ్యే గర్భిణులను ఆస్పత్రులకు తరలించినట్టు రావికమతం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాస్ మంగళవారం తెలిపారు. మండలంలో నలుగురు మహిళలకు నెలలు నిండి ఈ నెల 10వ తేదీలోగా ప్రసవమయ్యే అవకాశం ఉందన్నారు. తుపాను వర్షాలకు ఇక్కడ సౌకర్యాలు దెబ్బతినవచ్చని, దీంతోపాటు మెరుగైన వైద్య సహాయం కోసం వారిని అనకాపల్లి, నర్సీపట్నం ఆస్పత్రులకు ముందుగా తరలించామన్నారు.

లోవాంబిక అమ్మవారికి వెండి కిరీటం



గ్రామ పెద్దలకు వెండి కిరీటం అందజేస్తున్న దాతలు

రాంబిల్లి: మండలంలోని గోకివాడ గ్రామదేవత లోవాంబిక అమ్మవారికి భక్తులు వెండి కిరీటం బహూకరించారు. పందుల లోవరాజు, పందుల దొరయ్య, పందుల తాతీలు ఈ కిరీటాన్ని మంగళవారం గ్రామపెద్దలకు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నీరుకొండ శారదసూర్యనారాయణ, దిమిలి పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి సిరసపల్లి రామారావు, వైఎస్సార్‌సీపీ నాయకుడు ద్వారపురెడ్డి గోవిందరావు, పాలసంఘం అధ్యక్షుడు నందవరపు రాఘవరావు పాల్గొన్నారు.

కేకే లైన్‌లో పలు రైళ్ల రద్దు

తాటిచెట్లపాలెం(విశాఖ): కేకే లైన్‌లో తైడ–శివలింగపురం సెక్షన్ పరిధిలో భారీ వర్షాలకు కొండ చరియలు విరిగిపడడంతో ఈ మార్గంలో ప్రయాణించే రైళ్లు రద్దు చేసినట్టు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. మంగళవారం రాత్రి బయల్దేరాల్సిన విశాఖపట్నం–కిరండూల్(18514) నైట్ ఎక్స్‌ప్రెస్, తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో బుధవారం రాత్రి బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ రద్దయినట్టు పేర్కొన్నారు. బుధవారం ఉదయం బయల్దేరాల్సిన విశాఖపట్నం–కిరండూల్(08551) పాసింజర్ స్పెషల్, తిరుగు ప్రయాణంలో కిరండూల్‌లో గురువారం బయల్దేరాల్సిన కిరండూల్–విశాఖపట్నం (08552) పాసింజర్ స్పెషల్ రద్దు చేసినట్లు తెలిపారు. కిరండూల్‌లో మంగళవారం బయల్దేరిన కిరండూల్–విశాఖపట్నం(18513) నైట్ ఎక్స్‌ప్రెస్ వయా కోరాపుట్, రాయగడ, విజయనగరం, కొత్తవలస మీదుగా ప్రయాణిస్తుంది.

12న అనంతుని దీపోత్సవం



మాట్లాడుతున్న నార్త్ ఏసీపీ శివరామిరెడ్డి

పద్మనాభం: విశాఖపట్నం జిల్లా పద్మనాభంలో కొలువైన అనంత పద్మనాభ స్వామి దీపోత్సవం ఈ నెల 12న జరగనుంది. ఈ కార్యక్రమానికి పోలీస్ శాఖ తరఫున పకడ్బందీగా ఏర్పాట్లు చేస్తున్నట్టు నార్త్ ఏసీపీ ఎం.శివరామిరెడ్డి వెల్లడించారు. అనంత పద్మనాభ స్వామి మెట్లు, పరిసర ప్రాంతాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ బందోబస్తుకు సుమారు 400 మంది పోలీసులను వినియోగిస్తున్నట్లు తెలిపారు. అవసరమైన చోట బారికేడ్లు ఏర్పాట్లు చేయాలని, దీపోత్సవం రోజున ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సీఐ ఎన్.సన్యాసినాయుడును ఆదేశించారు. స్టేషన్‌లో పలు రికార్డులను పరిశీలించి.. సిబ్బందికి పలు సూచనలు చేశారు.



అనంతుని మెట్లు పరిశీలిస్తున్న నార్త్ ఏసీపీ

దంచికొట్టిన మిచాంగ్



ఎస్.రాయవరం మండలం రేవుపోలవరంలో కోతకు గురైన తీరం

- జిల్లాలో ఎడతెరిపి లేకుండా భారీగా కురుస్తున్న వర్షం
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- రహదారులు జలమయం
- తీరంలో ఎగసిపడుతున్న అలలు
- అత్యధికంగా పరవాడలో 17.7 సెంటీ మీటర్ల వర్షపాతం
- 13 వేల ఎకరాల్లో వరి పంటకు నష్టం
- అప్రమత్తతతో తప్పిన ప్రాణ నష్టం
- తీర ప్రాంతాల్లో పర్యటిస్తున్న అధికారులు
- రైతులకు సూచనలిస్తున్న వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు



రాంబిల్లిలోని కుమ్మరాపల్లిలో నేలకొరిగిన వరి దుబ్బులను కడుతున్న రైతులు



కోటవురట్లలో ఉధృతంగా ప్రవహిస్తున్న తుపాకుల గెడ్డ

జిల్లాలో మంగళవారం కురిసిన వర్షపాతం వివరాలు ఇలా ఉన్నాయి

మండలం	సెం.మీ.						
పరవాడ(తాడి గ్రామం)	17.7	మాడుగుల	11.8	అచ్యుతాపురం	7.8	కె.కోటపాడు	6.8
అనకాపల్లి	14.8	బుచ్చెయ్యపేట	11.5	కశింకోట	7.5	రాంబిల్లి	6.7
ఎస్.రాయవరం(దార్లపూడి)	13.7	చోడవరం	10.0	యలమంచిలి	7.5	చీడికాడ	5.8
రావికమతం	13.5	రోలుగుంట	9.7	అనకాపల్లి	7.3	నాతవరం	4.9
నర్సీపట్నం	12.7	గొలుగొండ	8.9	నక్కపల్లి	6.9	దేవరాపల్లి	4.2
		మునగపాక	8.7	మాకవరపాలెం	6.8	పాయకరావుపేట	1.6

సాక్షి, అనకాపల్లి: మిచాంగ్ తుపాను కారణంగా జిల్లాలో ఎడతెరిపి లేకుండా కుండపోతగా వర్షం కురుస్తోంది. మంగళవారం తెల్లవారుజాము నుంచే భారీగా వర్షం పడడంతో జనజీవనం స్తంభించింది. రహదారులు జలమయమయ్యాయి. ప్రధాన రహదారులు, లోతట్టు ప్రాంతాలు చెరువులను తలపించాయి. పలు ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. వాగులు, వంకలు పొంగి ప్రవహించాయి. జిల్లాలో అత్యధికంగా పరవాడలో 17.7 సెంటీ మీటర్లు, అనకాపల్లిలో 14.8 సెంటీ మీటర్లు, ఎస్.రాయవరంలో 13.6 సెంటీ మీటర్ల వర్షపాతం నమోదు కాగా, అత్యల్పంగా పాయకరావుపేటలో 1.6 సెంటీ మీటర్లు నమోదైంది. వర్షం కారణంగా సుమారు 13 వేల ఎకరాల వరకు వరిపంట నీట మునిగినట్టు అధికారులు అంచనా వేస్తున్నారు. వీటిలో 12 వేల ఎకరాల్లో కోయకుండా ఉన్న వరి పంట మునిగిపోయింది. మరో వెయ్యి ఎకరాల్లో కోతలు కోసిన పంట పూర్తిగా నీట మునిగింది. ఎస్.రాయవరం, కోటవురట్ల, నర్సీపట్నం, మాకవరపాలెం, నక్కపల్లి, యలమంచిలి, రోలుగుంట, చోడవరం, మాడుగుల, గొలుగొండ, కె.కోటపాడు, దేవరాపల్లి, రాంబిల్లి, అనకాపల్లి, కశింకోట, పాయకరావుపేట మండలాల్లో పంట నష్టం వాటిల్లింది. జిల్లా యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడంతో ఎటువంటి ప్రాణనష్టం జరగలేదు. జిల్లాలో పలు చెరువులు, వాగులు ఉప్పొంగాయి. జలాశయాలకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరదనీరు చేరుతోంది. రాగల 24 గంటల్లో జిల్లాలో పలు చోట్ల మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నట్టు వాతావరణ శాఖ తెలిపింది. తీర ప్రాంతాలు, మత్స్యకార గ్రామాల్లోఅధికారులు పర్యటించి, సూచనలు చేశారు.

కోతకు గురైన రేవుపోలవరం తీరం

ఎస్.రాయవరం మండలం రేవుపోలవరంలో అలలు ముందుకు వచ్చి కొంత మేర తీరం కోతకు గురైంది. సుమారు వంద మీటర్ల మేర సముద్రం ముందుకు రావడంతో తీరం కోతకు గురైనట్టు స్థానికులు తెలిపారు. వీకెండ్‌లో పర్యాటకులు సందర్శించే ఈ ప్రదేశం కోతకు గురై ప్రమాదకంగా మారిందని వారు చెప్పారు.

జలాశయాల్లో పెరిగిన నీటి మట్టం

మాడుగుల మండలంలో పెద్దేరు జలాశయానికి ఇన్‌ఫ్లో పెరుగుతోంది. మంగళవారం ఉదయం 10 గంటల వరకు 12 క్యూసెక్కులున్న ఇన్‌ఫ్లో సాయంత్రానికి 40 క్యూసెక్కులకు పెరిగింది. జలాశయం గరిష్ఠ నీటిమట్టం 137 మీటర్లు కాగా, ప్రస్తుతం 131.40 మీటర్లకు చేరింది. దేవరాపల్లి మండలంలో రైవాడ జలాశయం గరిష్ఠ నీటిమట్టం 114 మీటర్లు కాగా ప్రస్తుతం 106.20 మీటర్లుగా ఉంది. జలాశయంలోకి 1000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది.

అన్నిశాఖల సమన్వయంతో సహాయక చర్యలు

అనకాపల్లిటౌన్: మిచాంగ్ తుపాను నేపథ్యంలో జిల్లాలో రెవెన్యూ, వైద్యఆరోగ్య, మున్సిపల్, పంచాయతీ, విద్యుత్ శాఖల అధికారులతో పోలీసు అధికారులు సమన్వయం చేసుకుంటూ సహాయక చర్యలు చేపడుతున్నట్టు ఎస్పీ కె.వి. మురళీకృష్ణ తెలిపారు. అచ్యుతాపురం రహదారిలో విరిగిపడిన చెట్లను పోలీసు అధికారులు జేసీబీ సాయంతో తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించినట్లు పేర్కొన్నారు. తక్షణ సహాయం కోసం 100, 112, పోలీస్ కంట్రోల్ రూం నంబర్ 93469 12724 సమాచారమివ్వాలని ఆయన కోరారు.

తుపాను ప్రభావిత ప్రాంతాల్లో తక్షణ చర్యలు

- ప్రభుత్వ విప్ ధర్మశ్రీ



అధికారులతో సమీక్షిస్తున్న ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ

చోడవరం: తుపాను ప్రభావిత ప్రాంతాల్లో అవసరమైన తక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులకు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ఆదేశించారు. నియోజకవర్గంలో చోడవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల తహసీల్దార్లు, ఎంపీడీవో, వ్యవసాయ, ఇరిగేషన్ అధికారులతో తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మంగళవారం సమీక్ష నిర్వహించారు. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు జరిగిన ప్రాథమిక నష్టాన్ని అడిగి తెలుసుకున్నారు. అవసరమైతే పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేసి లోతట్టు ప్రాంతాల్లో ప్రజలను తరలించాలని ఆదేశించారు. వర్షాలు తెరిపిచ్చిన వెంటనే నేరుగా పొలాల్లోకి వెళ్లి పంట నష్టాన్ని అంచనావేయాలని ఆదేశించారు. పంటల ముంపుపై రైతులెవ్వరూ ఆందోళన చెందవద్దని ఎమ్మెల్యే కోరారు.

అప్రమత్తంగా ఉండాలి

- జెడ్పీ సీఈవో పోలినాయుడు



మాట్లాడుతున్న జెడ్పీసీఈవో పోలినాయుడు

మాడుగుల: మిచాంగ్ తుపాను తీరం దాటిన తర్వాత నష్టం ఎక్కువగా ఉండే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని జెడ్పీ సీఈవో ఎం.పోలినాయుడు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు మాడుగుల మండలం ఏజెన్సీకి ముఖద్వారం కావడంతో వరద ముంపు ఎక్కువగా ఉంటుందని, ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు.

పకడ్బందీగా సహాయక చర్యలు



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల: తుపానుపై ప్రజలందరిని అప్రమత్తం చేసి, వచ్చే ఇబ్బందులపై ప్రజలకు అవగాహన కల్పించాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో తుపాను ముందస్తు జాగ్రత్తలపై మంగళవారం జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, పోలీసు అధికారులతో ఆయన వెబెక్స్ మీటింగ్ నిర్వహించారు. జిల్లాలో చేపట్టవలసిన ముందస్తు జాగ్రత్తలపై అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పాత, పటిష్టంగా లేని గృహాలను గుర్తించి నివాసితులను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, లోతట్టు ప్రాంతాల్లో ఉన్నవారిని పునరావాస శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. శిబిరాల్లో తాగునీరు, ఆహారం అందుబాటులో ఉండేలా చూడాలన్నారు. అధికారులందరూ సమన్వయంతో పనిచేసి, ప్రజలకు ఏ విధమైన ఇబ్బందులు కలగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు.

ఎస్పీ కె.వి. మురళీకృష్ణ మాట్లాడుతూ అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. పోలీసు అధికారులు జిల్లా యంత్రాంగానికి సహకారం అందించాలన్నారు. ఎటువంటి ఘటనలు జరిగినా వెంటనే స్పందించి చర్యలు చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జేసీ ఎం.జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి బి.దయానిధి, సీపీవో జి.రామారావు, అన్ని మండలాల అధికారులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.


జీవీఎంసీ కౌన్సిల్ సమావేశం వాయిదా

డాబాగార్డెన్స్(విశాఖ): జీవీఎంసీలో బుధవారం నిర్వహించనున్న కౌన్సిల్ సమావేశం తుపాను కారణంగా వాయిదా వేస్తున్నట్టు మేయర్ హరి వెంకటకుమారి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తుపాను సహాయక చర్యల్లో ప్రజా ప్రతినిధులు, కార్పొరేటర్లు, జీవీఎంసీ యంత్రాంగం నిమగ్నమై ఉందన్నారు. డిప్యూటీ మేయర్లు, ఫ్లోర్‌లీడర్ల అభ్యర్థన, జీవీఎంసీ కమిషనర్ సిఫార్సు మేరకు ఈ సమావేశం వాయిదా వేస్తున్నట్టు వెల్లడించారు. సమావేశం తిరిగి ఎప్పుడు నిర్వహించేది త్వరలోనే తెలియజేస్తామన్నారు.

వేపకొమ్మలు చేతపట్టి.. బురదను జల్లుకుంటూ..!

- వింత జాతరలో ఉత్సాహంగా పాల్గొన్న పురుషులు

రాంబిల్లి : వింత జాతరగా పేరొందిన దిమిలి బురదమాంబ జాతర మంగళవారం ఘనంగా జరిగింది. వేకువజాము 3 గంటల నుంచే పురుషులంతా వయసుతో సంబంధం లేకుండా వీధుల్లోకి వేపకొమ్మలు చేతపట్టి వచ్చారు. మురుగు కాలువలు, సంతబయలు వద్ద ఏర్పాటు చేసిన బురదలో వేపకొమ్మలు ముంచి బురదను ఒకరిపై ఒకరు జల్లుకున్నారు. ఈ జాతర సమయంలో గ్రామంలోకి ప్రవేశించిన ఇతర గ్రామస్తులకు బురద జల్లి గ్రామ ఆచారాన్ని చాటుకున్నారు. దల్లమాంబ అనుపు ఉత్సవంలో భాగంగా మంగళవారం బురదమాంబ జాతరను ఘనంగా నిర్వహించారు. సంప్రదాయం ప్రకారం ఈ బురద ఉత్సవంలో ఆడవారికి మినహాయింపునిచ్చారు. ఉదయం 11 గంటల వరకు ఈ జాతర కొనసాగింది. అనంతరం బురద ఉత్సవంలో వినియోగించిన వేపకొమ్మలను అమ్మవారి ఆలయం వద్ద ఉంచి పూజలు చేశారు. బురద ఒళ్లంతా పులుముకున్నా ఎటువంటి చర్మవ్యాధులు సోకకపోవడం అమ్మవారి మహాత్యమని, ఇందులో పాల్గొన్న వారికి సకల శుభాలు కల్గుతాయని గ్రామస్తుల విశ్వాసం.



బురదమాంబ అమ్మవారు



బురదోత్సవంలో పాల్గొన్న యువకులు

ఏలేరు కడగండ్లకు చెక్

ఏలేరు కాలువ ముంపు సమస్యకు ప్రభుత్వం శాశ్వత పరిష్కారం చూపింది. భారీ వర్షాలు కురిసే సమయంలో కాలువకు గండ్లు పడి ఆ నీరు పొలాలను, ఊళ్లను ముంచెత్తేది. దీంతో తుపాను సమయంలో ఈ ప్రాంత వాసులు బితుకుబితుకుమంటూ కాలం వెళ్లదీసేవారు. కాలువకు మూడు చోట్ల ప్రైవేట్ చానళ్లు నిర్మించి, ముంపు సమస్యను పరిష్కరించారు. వాటిలో రెండు చానళ్ల ద్వారా మొదటిసారిగా మంగళవారం నీటిని నదిలోకి అధికారులు విడుదల చేసి, మిచాంగ్ తుపాను సమయంలో పంటలను కాపాడారు. దీంతో ఈ ప్రాంత రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- ముంపు సమస్యకు శాశ్వత పరిష్కారం
- జిల్లాలో మూడో చోట్ల రూ.1.2 కోట్లతో ప్రైవేట్ చానళ్ల నిర్మాణం
- మొదటి సారిగా వీటి ద్వారా నదిలోకి నీరు విడుదల
- ఇక భారీ వర్షాలు కురిసినా ప్రమాదం లేదంటున్న అధికారులు



60వ కిలో మీటరు వద్ద ప్రైవేట్ చానల్ ద్వారా తాండవ నదిలోకి విడుదల చేస్తున్న నీరు



ఎ.శరభవరంలో గ్రామం మధ్య నుంచి ఏర్పాటు చేసిన ఏలేరు కాలువ

నాతవరం: ఏళ్ల తరబడి తుపాన్ల సమయంలో వెంటాడే ఏలేరు కాలువ నీటి ముంపు సమస్యకు మోక్షం లభించింది. ఏలేరు కాలువ సమీపంలో ఉండే గ్రామాల ప్రజలు ఏటా తుపాన్ల సమయంలో ఏ ప్రమాదం జరుగుతుందోనని భయంతో కాలం వెళ్లదీసేవారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఏలేరు కాలువపై రూ.1.20 కోట్లతో మూడు చోట్ల ప్రైవేట్ చానళ్లు నిర్మించింది. నాతవరం మండలం ఏలేరు కాలువ 60వ కిలోమీటరు వద్ద ఓ చానల్ నిర్మించారు. అత్యవసర సమయంలో ఏలేరు కాలువలో నీటిని తగ్గించాలంటే ఈ చానల్ నుంచి నీటిని తాండవ నదిలోకి విడుదల చేస్తారు. అనకాపల్లి మండలంలో ఏలేరు కాలువపై 87వ కిలోమీటరు వద్ద మరో చానల్ నిర్మించారు. ఇక్కడ శారదా నదిలోకి నీటిని విడుదల చేస్తారు. మాకవరపాలెం మండలం కొండలఅగ్రహారం వద్ద మూడో చానల్ నిర్మించారు. అక్కడ నది లేకపోవడంతో రైతులు, గ్రామస్తుల అభీష్టం మేరకు కొండ గెడ్డలోకి నీరు వదులుతారు. ఇలా చానళ్ల ద్వారా నీరు తరలించే అవకాశం ఏర్పడటంతో ఎంత పెద్ద తుపాను వచ్చినా ఏలేరు కాలువ పరిసర ప్రాంతాలకు నీటి ముంపు సమస్య ఏర్పడదు. దీంతో కాలువ పరిసరాల్లోని గ్రామస్తులకు భయం తొలగింది.

విశాఖపట్నం ప్రజలకు తాగునీరు, పరిశ్రమలకు అవసరమైన నీటిని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఏలేశ్వరం రిజర్వాయరు నుంచి తరలించేందుకు ఉమ్మడి తూర్పుగోదావరి, ఉమ్మడి విశాఖపట్నం జిల్లాల పరిధిలో సుమారు 154 కిలో మీటర్ల పొడవున ఏలేరు కాలువ నిర్మించారు. అప్పటి నుంచి తుపాన్లు సంభవించినపుడు, ఏలేరు కాలువలో నీటి ఉధృతి పెరిగినపుడు ఈ కాలువకు ఇరువైపులా పొలాలున్న రైతులు, పలు గ్రామాల ప్రజలు ముంపు సమస్యతో బాధపడేవారు. ఏటా ఏదో ఒక చోట కాలువకు గండి పడడంతో ఆ పరిసరాల్లో ఉన్న పంట పొలాలు ముంపునకు గురై తీవ్ర నష్టం కలిగేది. ఈ రెండు జిల్లాల్లోని 12 మండలాల పరిధిలో పలు గ్రామాల మధ్య నుంచి ఏలేరు కాలువ ఉంది. కొన్ని గ్రామాలు ఏలేరు కాలువకు లోతట్టు ప్రదేశంలో ఉండడంతో గండిపడితే ముంపునకు గురయ్యేవి. దీంతో ఏటా తుపాన్ల సమయంలో కాలువకు ఇరువైపులా ఉన్న రైతులు, గ్రామస్తులు ఏలేరు అధికారులపై తీవ్ర ఒత్తిడి చేసేవారు. గత ప్రభుత్వాలు ఈ సమస్యను పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేశాయి. రైతులు, ఈ ప్రాంత ప్రజలు తమ సమస్యను ప్రజా ప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో రెండేళ్ల కిందట వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏలేరు కాలువ ముంపు సమస్య పరిష్కారానికి ఏర్పాట్లు చేసింది. 2022లో మూడు చానళ్ల నిర్మాణం పూర్తయింది. వీటిలో రెండు చానళ్ల ద్వారా మంగళవారం తాండవ నదిలోకి 30 క్యూసెక్కుల నీరు, శారదా నదిలోకి 30 క్యూసెక్కుల నీటిని విడిచిపెట్టారు. నిర్మాణం పూర్తయిన తరువాత ఇలా నీటిని విడిచిపెట్టడడం ఇదే మొదటి సారి.

ఏటా గ్రామంలోకి నీరు వచ్చేది



మా గ్రామం ఏలేరు కాలువ గట్టుకు ఆనుకుని ఉంది. పంట పొలాలు కూడా ఏలేరు కాలువ దిగువ ప్రాంతంలో ఉన్నాయి. ఏలేరు కాలువకు గండ్లు పడే సమయంలో పొలాలు ముంపునకు గురయ్యేవి. ఏలేరు కాలువలో నీటి ఉధృతి పెరిగితే ఆ నీరంతా పొలాల్లోనే ఉండేది. గ్రామంలోకి కూడా నీరు వచ్చేది. చానళ్ల నిర్మాణం పూర్తియిన తరువాత గండ్లు పడడం లేదు.

– కర్రి వెంకటరమణ ఎ.శరభవరం

ధైర్యంగా ఉంటున్నాం

ఏలేరు కాలువపై ప్రైవేట్ చానల్ నిర్మించాక ధైర్యంగా ఉద్యోగం చేస్తున్నాం. గతంలో తుపాన్ల సమయంలో రైతులు, ప్రజల నుంచి తీవ్ర ఒత్తిడి ఉండేది. చానళ్ల నిర్మాణం పూర్తయ్యాక కాలువకు గండ్ల సమస్య తప్పింది. అత్యవసర సమయంలో కాలువలో నీటిని ప్రైవేట్ చానళ్ల ద్వారా తాండవ, శారధా నదుల్లోకి విడుదల చేస్తున్నాం. మాకవరపాలెం మండలంలో గెడ్డలోకి నీరు విడుదల చేస్తాం. చానళ్లు లేకముందు కాలువలో నీటిని తగ్గించేందుకు అవస్థలు పడేవారం. ఏలేశ్వరంలో నీటిని నిలుపుదల చేస్తే మూడు రోజుల తర్వాత గానీ ఇక్కడ తగ్గేదికాదు. ఈలోగా తీవ్ర నష్టం జరిగిపోయేది. మిచాంగ్ తుపాను హెచ్చరికల కారణంగా నాలుగు రోజుల క్రితమే కాలువలో నీరు తగ్గించాం.

– నానాజీ, ఏలేరు కాలువ జేఈ, అనకాపల్లి

క్లుప్తంగా

9న మెగా లోక్ అదాలత్

విశాఖ లీగల్: ఉమ్మడి విశాఖ జిల్లాలో ఈ నెల 9న జరిగే మెగా లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ పిలుపునిచ్చారు. ఉమ్మడి విశాఖ జిల్లా న్యాయమూర్తులతో మంగళవారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ న్యాయవాదులు, న్యాయమూర్తులు, కక్షిదారులు, వివిధ ప్రభుత్వ సంస్థల ప్రతినిధులు మెగా లోక్ అదాలత్‌లో పాల్గొనాలని కోరారు. పౌర, నేర శిక్షాస్మృతి పరిధిలోని ఎంపిక చేసిన కేసులు, నిరాధరణకు గురైన చెక్కులు, బ్యాంకులు, బీమా కంపెనీ, ఇతర ప్రభుత్వ సంస్థలు, మహా నగర పాలక సంస్థ, వీఎంఆర్డీఏ తదితర సంస్థలు తమ కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. న్యాయవాదులు కేసులను ఎంపిక చేయాలని సూచించారు. రాజీ కాగాలిగిన కేసులను పోలీస్ అధికారులు గుర్తించి.. ఎటువంటి సమస్య లేకుండా వాటి రాజీకి కృషి చేయాలని కోరారు. సమావేశంలో మెట్రో సెషన్స్ జడ్జి శ్రీదేవి, అదనపు న్యాయమూర్తి ఎం.వెంకటరమణ, విశాఖ న్యాయ సేవా ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎం.వి.శేషమ్మ, జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చింతపల్లి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో అసభ్య దూషణలపై ఫిర్యాదు

రావికమతం: సోషల్ మీడియా వేదికగా తమపై, తమ పిల్లలపై అసభ్య పదజాలంతో పోస్టులు పెడుతున్నాడని గొర్లి నాగేశ్వరరావుపై ఆ గ్రామానికి చెందిన గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకురాలు పాతాళ రాజేశ్వరి రావికమతం పోలీసులకు మంగళవారం ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు అయ్యింది. నాగేశ్వరరావు వ్యక్తిగత కక్షలతో తమను, పెంపుడు కుక్కపైన సోషల్‌మీడియా వేదికగా చేసుకుని అసభ్య పదజాలంతో అవమానపరుస్తున్నారని వాపోయారు. గ్యాస్ గోదాము ఊరి చివర ఉండగా ఇంటి పక్కనే గ్యాస్ సిలిండర్లను నిల్వ ఉంచుతున్నామని సోషల్ మీడియాలో తప్పుడు వీడియోలు పెట్టాడని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనిపై ఎస్ఐ ఉమామహేశ్వరరావును సంప్రదించగా ఫిర్యాదు అందిందని కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామన్నారు.

రైల్వేస్టేషన్‌లో తనిఖీలు

తాటిచెట్లపాలెం: నార్కోటిక్స్‌ను గుర్తించడంలో ప్రత్యేక శిక్షణ పొందిన విక్కీ(స్నిఫర్ డాగ్) విశాఖ రైల్వే స్టేషన్‌లో తన విధులను ప్రారంభించింది. తొలిరోజే(ఈ నెల 2వ తేదీ) 12 కిలోల మత్తు పదార్థాలను గుర్తించింది. రైల్వేస్టేషన్‌లో మత్తు పదార్థాలు, అసాంఘిక శక్తులను గుర్తించడంలో టాస్క్‌ఫోర్స్, ఆర్పీఎఫ్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయి. స్టేషన్‌లో భద్రతా ప్రమాణాలు పెంపులో భాగంగా తాజాగా డాగ్ స్క్వాడ్ అందుబాటులోకి వచ్చింది.

ముమ్మర సహాయ చర్యలు

- లోతట్టు ప్రాంతాల్లో పర్యటించిన అధికారులు



అనకాపల్లిలో ఆర్టీసీ కాంప్లెక్స్‌లో వర్షపునీరు



అచ్యుతాపురం మండలం పూడిమడకలో తుఫాన్ ప్రభావంపై అధికారులతో చర్చిస్తున్న అనకాపల్లి ఆర్డీవో చిన్నికృష్ణ



నర్సీపట్నం పట్టణంలోని డ్రైనేజీల్లో పూడిక తీయిస్తున్న కమిషనర్ రవిబాబు, వైస్ చైర్మన్ రామకృష్ణ



ఎస్.రాయవరం మండలం బంగారమ్మపాలెం పూరిళ్లలో ఉంటున్న వారితో మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ మహేష్



నర్సీపట్నం పట్టణంలో ఎరువుల దుకాణంలోకి చేరిన వర్షపు నీరు



యలమంచిలి మండలం ఏటికొప్పాకలో కళాకారుల ఇళ్లలోకి వచ్చిన వర్షపు నీరు

సాక్షి నెట్‌వర్క్: మిచాంగ్ తుపాను ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు పలు గ్రామాలు జలమయమయ్యాయి. వాగులు, నదులు పొంగి ప్రవహిస్తున్నాయి. అనకాపల్లి, నర్సీపట్నం, చోడవరం, తదితర పట్టణాల్లో రోడ్లపై వర్షపు నీరు చేరి జనజీవనం స్తంభించింది. ఆయా చోట్ల ఆర్టీసీ కాంప్లెక్స్‌లోనూ ఇదే పరిస్థితి నెలకొంది. లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి వర్షపు నీరు చేరింది. పొలాల్లో వరి పంట నేలకొరిగింది. రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుచోట్ల అధికారులు అప్రమత్తమై ముమ్మర సహాయ చర్యలు చేపట్టారు. లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి అక్కడ ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రైతులకు క్షేత్రస్థాయిలో సలహాలు, సూచనలు అందిస్తున్నారు.

వర్షంలోనూ ఆస్పత్రులకెళ్లి పింఛన్ల అందజేత



విశాఖ కేజీహెచ్‌లో రోగి పెదప్పలనాయుడికి పింఛన్ అందించిన వలంటీర్ పుష్ప



నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో వరహాలమ్మకు పింఛను అందజేస్తున్న వలంటీరు కరక నాయుడు

రోలుగుంట/చీడికాడ: సంక్షేమ పథకాలు ప్రజలకు చేరువ చేయడంలో గ్రామ వలంటీర్లు శభాష్ అనిపించుకుంటున్నారు. తాజాగా తుపాను వరాన్ని సైతం లెక్క చేయకుండా ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న ఇద్దరికి పింఛన్లు అందించి తమ వృత్తి ధర్మాన్ని చాటుకున్నారు. రోలుగుంట మండలం కొవ్వూరు గ్రామానికి చెందిన బలిరెడ్డి పెదప్పలనాయుడు విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. ఈ విషయం వలంటీర్ చందక పుష్ప అక్కడికి వెళ్లి లబ్ధిదారుడికి పింఛన్ నగదు అందజేసింది. తుపానును సైతం లెక్క చేయకుండా తన వద్దకు వచ్చి పింఛన్ ఇచ్చిన ఆమెకు కృతజ్ఞతలు తెలిపాడు. చీడికాడ మండలం అర్జునగిరి గ్రామానికి చెందిన అప్పలబత్తుల వరహాలమ్మ అనారోగ్యంతో నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఆమె వద్దకు గ్రామ వలంటీరు కరక నాయుడు మంగళవారం వెళ్లి పింఛన్ అందజేశాడు. సర్పంచ్ బి. రమాదేవి అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

కశింకోట : మండలంలోని బయ్యవరం వంతెన వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. పోలీసుల వివరాల ప్రకారం.. యలమంచిలి నుంచి అనకాపల్లి వైపు వస్తున్న వ్యాన్ మరమ్మతులకు గురై బయ్యవరం వంతెన వద్ద ఆగిపోయింది. దానికి మరమ్మతులు చేయడానికి కారును వెనుకగా నిలపగా, యలమంచిలి నుంచి అనకాపల్లి వస్తున్న లారీ వీటిని ఢీకొట్టింది.

దీంతో వ్యాన్ డ్రైవర్ భోశెట్టి రామ జగన్నాథ రావు, క్లీనర్ పూజారి బాలకృష్ణ, కారు డ్రైవర్ గుత్తూరు వేణు గాయపడ్డారు. వారిని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి 108లో తరలించారు. ప్రమాదంలో కారు దెబ్బతింది. ఈ మేరకు అందిన ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు అదనపు ఎస్ఐ నాగేశ్వరరావు తెలిపారు.

బైక్ అదుపు తప్పి ప్రమాదం

- ఒకరి మృతి, మరొకరికి స్వల్పగాయాలు
- పాడేరు ఘాట్‌లో రాజపురం సమీపంలో ఘటన



సంఘటన స్థలంలో శ్రీధర్ మృతదేహం

సాక్షి, పాడేరు: పాడేరు ఘాట్‌లోని రాజపురం సమీపంలో బైక్ అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ఒకరు మృతి చెందగా, మరొక వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. మంగళవారం జరిగిన సంఘటన వివరాలిలా ఉన్నాయి. అనకాపల్లి జిల్లా వి.మాడుగుల మండలం వీరనారాయణం గ్రామానికి చెందిన శరగడం శ్రీధర్ (24), ఆదిబాబు తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. పాడేరులో పనులు చూసుకుని సాయంత్రం బైక్‌పై వీరిద్దరూ స్వగ్రామానికి బయలుదేరారు. వర్షం కురుస్తున్న సమయంలో వారు వస్తుండగా బైక్ ఒక్కసారిగా అదుపు తప్పింది. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు కింద పడిపోయారు. వీరిలో శ్రీధర్ తలకు తీవ్ర గాయమవడంతో సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. ఆదిబాబుకు స్వల్పగాయాలయ్యాయి. పిడుగు శబ్దం వచ్చిన సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకుందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. శ్రీధర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాడేరు జిల్లా ఆస్పత్రికి తరలించారు. పాడేరు ఎస్ఐ రంజిత్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వైన్‌షాపులో చోరీ కేసులో ఇద్దరికి జైలు

కశింకోట : కశింకోటలోని ప్రభుత్వ వైన్ దుకాణంలో దొంగతనానికి పాల్పడినట్టు నేరం రుజువు కావడంతో ఇద్దరు వ్యక్తులకు మూడేళ్ల కఠిన కారాగార శిక్ష, చెరో రూ.10 వేలు వంతున జరిమానా విధిస్తూ అనకాపల్లి 12వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ బి.వి.విజయలక్ష్మి మంగళవారం తీర్పు చెప్పారు. సీఐ ఎ. రవికుమార్ అందించిన వివరాలివి. కశింకోట గ్రామంలోని కోట దిబ్బ వద్ద ఉన్న ప్రభుత్వ వైన్ దుకాణంలో 2021 మార్చి 7న రాత్రి తాడేపల్లి గూడెంకు చెందిన పైబోయిన ధన వెంకటరాము, యాదగిరి గోవిందు(కశింకోట) ప్రవేశించి రూ.4.17 లక్షల నగదు, 18 వైన్ సీసాలను అపహరించారు. వారిని పట్టుకొని అరెస్టు చేసి చోరీకి గురైన సొమ్ము, మద్యం సీసాలు స్వాధీనం చేసుకొని అప్పటి సీఐ జి. శ్రీనివాసరావు అనకాపల్లి 12వ మేజిస్ట్రేట్ కోర్టుకు తరలించారు. కేసు విచారణ జరిగి నేరం నిరూపణ కావడంతో నిందితులకు శిక్ష పడిందని సీఐ తెలిపారు. జిల్లా ఎస్పీ కె.వి. మురళీకృష్ణ ఆధ్వర్యంలో స్పీడీ ట్రైల్ కేసుగా పరిగణనలోకి తీసుకొని సాక్షులను కోర్టులో హాజరు పరిచి త్వరితగతిన విచారణ కావడానికి కోర్టు వారికి సహకరించినట్టు తెలిపారు.

తీరం అల్లకల్లోలం

- ముందుకు వచ్చిన అలలు
- కోతకు గురైన తీరం





భీమునిపట్నం/కొమ్మాది : మిచాంగ్ తుపాను నేపథ్యంలో పెద్ద ఎత్తున కెరటాలు, బలమైన ఈదురు గాలులతో భీమిలి నుంచి గుడ్లవానిపాలెం బీచ్ వరకు తీరం అల్లకల్లోలంగా మారింది. మంగమారిపేట, రుషికొండ, సాగర్‌నగర్ బీచ్‌ల వద్ద కెరటాలు పెద్ద ఎత్తున ఎగసిపడి తీరాన్ని కోతకు గురిచేసింది. రుషికొండ బీచ్‌లో ఏర్పాటు చేసిన చిల్డ్రన్స్ పార్కు, సాగర్‌నగర్‌లో కొబ్బరితోట పార్కు నీట మునిగాయి. మంగమారిపేట, ఉప్పాడ, భీమిలి తీర ప్రాంతాల్లో సముద్రం కాస్త ముందుకు చొచ్చుకుని రావడంతో మత్స్యకారులు ఆందోళనకు గురయ్యారు. భీమిలి తీరంలో అలల తీవ్రతకు బోయివీధి గట్టు చాలా వరకు దెబ్బతింది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో ఇప్పటికే మత్స్యకారులు వేటకు స్వస్తి చెప్పి, పడవలు, బోట్లు, వలలను సురక్షిత ప్రాంతాలకు తరలించుకున్నారు. ఈదురు గాలులు ప్రభావంతో ఈ ప్రాంతాల్లో కొన్ని చోట్ల విద్యుత్ అంతరాయం ఏర్పడింది. రుషికొండ బీచ్‌లో పర్యాటకులు సముద్రంలోకి వెళ్లకుండా ఎర్ర జెండాలను ఏర్పాటు చేశారు. కె.నగరపాలెం, కాపులుప్పాడ ప్రాంతాల్లో వర్షాలకు వరి పంట నీట మునిగింది.

సీతంపేట ఈ ఆధార్ బ్యాంక్‌లో చోరీ

- షట్టర్ తాళాలు పగలు కొట్టి రూ.3.50 లక్షల అపహరణ
- సంఘటనా స్థలాన్ని సందర్శించిన సీఐ, ఎస్ఐ
- క్లూస్ టీమ్‌తో ఆధారాల సేకరణ



చోరీ జరిగిన షాపును పరిశీలిస్తున్న సీఐ తాతారావు, ఎస్ఐ నాగేంద్ర



షాపు నిర్వాహకుడు శ్రీరామమూర్తి నుంచి వివరాలు సేకరిస్తున్న పోలీసులు

దేవరాపల్లి: నాగయ్యపేట శివారు సీతంపేటలోని ఈ ఆధార్ బ్యాంక్ (ఏపీజీవీబీ ఖాతాదారుల సేవా కేంద్రం)లో సోమవారం రాత్రి దొంగతనం జరిగింది. గుర్తు తెలియని వ్యక్తులు షట్టర్ తాళాలు పగలుకొట్టి అందులోని రూ. 3.50 లక్షల నగదును అపహరించుకుపోయారు. ఎస్ఐ డి. నాగేంద్ర కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నాగయ్యపేటకు చెందిన కొయినాన శ్రీరామమూర్తి సీతంపేటలో షాపు అద్దెకు తీసుకొని ఏడాదిగా ఈ ఆధార్ బ్యాంక్‌ను నిర్వహిస్తున్నాడు.

నగదు చెల్లింపులతో పాటు ప్రజలకు అందించే ఆన్‌లైన్ సేవల ద్వారా వచ్చే ఆదాయాన్ని అదే షాపులో నిర్వాహకుడు భద్రపరుస్తాడు. ఎప్పటి మాదిరిగానే సోమవారం రాత్రి షాపులోనే నగదు భద్రపరిచి షట్టరుకు తాళాలు వేసి ఇంటికి వెళ్లారు. మంగళవారం ఉదయం షాపు షట్టరు తెరిచి ఉండడాన్ని చూసిన స్థానికులు షాపు నిర్వాహకుడు శ్రీరామమూర్తికి తెలియజేశారు. వెంటనే షాపు వద్దకు వచ్చి చూసి తన షాపులో నగదు చోరీకి గురైనట్టు గుర్తించి 100కు ఫోన్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దొంగతనం జరిగిన షాపును సీఐ ఎస్. తాతారావు, స్థానిక ఎస్ఐ డి. నాగేంద్ర పరిశీలించారు. పోలీస్ జాగిలాలతో పాటు క్లూస్ టీమ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. బాధితుడు శ్రీరామమూర్తి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అన్ని కోణాల్లో సమగ్ర దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. ఇదిలా ఉండగా ఇటీవల వరుసగా పలు ఆలయాల హుండీల్లో నగదు చోరీ జరగ్గా, తాజాగా షాపులో నగదు దొంగతనం జరగడంతో పోలీసులకు సవాల్‌గా మారింది.

8న మేరీమాత పండగ

- ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వేలాదిగా తరలిరానున్న భక్తులు
- ప్రారంభమైన ఉత్సవ ఏర్పాట్లు



విద్యుత్ దీపాల అలంకరణలో మేరీమాత గుహ



ప్రధాన ఆలయం

డాబాగార్డెన్స్: నగరంలోని పాత పోస్టాఫీస్ వద్ద గల కొండగుడి (రోస్‌హిల్స్)పై కొలువు దీరి అమలోద్భవి (విశాఖపురి మేరీమాత) రోస్‌హిల్స్‌పై వెలసిన మేరీ మాత పుణ్య క్షేత్రం విశాఖకు ప్రత్యేక ఆభరణం. దీనినే 'కొండగుడి'గా భక్తులు పిలుచుకుంటారు. ఏటా డిసెంబరు 8వ తేదీన జరిగే కొండగుడి పండగకు హిందూ, ముస్లిం, కథోలిక, కథోలికేతర క్రైస్తవులు అశేషంగా తరలివస్తారు. కొండమాత ఉత్సవాలు దాదాపు తొమ్మిది రోజుల పాటు సాగుతాయి. ఉత్సవాలు గత నెల 29వ తేదీన ప్రారంభమయ్యాయి. ఈ నెల 8వ తేదీ శుక్రవారం వరకూ జపమాల, దివ్యపూజ, స్వస్థత ప్రార్థనలు నిర్వహిస్తారు. కొండగుడిపై వెలసిన అమలోద్భవి మాత పట్ల అపారమైన నమ్మకం గల భక్తులు ఇక్కడ తలనీలాలు సమర్పించుకొని, అమ్మ ముందు మొకరిల్లుతారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచే గాక ఉభయగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి భక్తులు వచ్చి తమ మొక్కులు తీర్చుకుంటారు.

ట్రాఫిక్ ఆంక్షలు ఇలా..

గురువారం అర్ధరాత్రి నుంచి శుక్రవారం అర్ధరాత్రి వరకు పోర్టు ఏరియా రోస్‌హిల్స్ కొండపై జరిగే విశాఖపురి(కన్య మరియమ్మ) పండగ సందర్భంగా రాష్ట నలుమూలల నుంచి వచ్చే భక్తులకు ట్రాఫిక్ నిబంధనలను పోలీసులు సూచించారు.

- పాత పోస్టాఫీస్‌కు ఆర్టీసీ బస్సులతో పాటు వచ్చే అన్ని వాహనాలు సున్నపువీధి నుంచి వెలంపేట, గోపాల్ ఆటో జంక్షన్, లక్ష్మీటాకీస్ మీదుగా విక్టోరియా రాణి విగ్రహం వద్ద చేరుకుని తిరిగి అదే దారిలో వెనక్కి వెళ్లాలి.
- బీచ్‌రోడ్డు, కోటవీధి వైపు వచ్చే వాహనాలు బీచ్‌రోడ్డులోనే సెయింట్ అలోసిస్ స్కూల్ వరకు మాత్రమే అనుమతిస్తారు.
- సీహార్స్ జంక్షన్ నుంచి రోజ్‌హిల్స్‌కు వెళ్లే దారిలో ద్విచక్ర, నాలుగు చక్ర వాహనాలు మాత్రమే హార్బర్ ఓల్డ్ పోలీస్ స్టేషన్‌జంక్షన్ వెనుక ఆదాని రోడ్డు, పప్పుల గొడౌన్ రోడ్డులో పార్కింగ్ స్థలాలు అనుమతించబడును.
- కన్వేయర్ బెల్ట్ రోడ్డులో సీహార్స్ జంక్షన్, రైల్ క్రాసింగ్ జంక్షన్ నుంచి రోజ్ హిల్స్ కొండ డౌన్ వరకు ఎలాంటి వాహనాలు అనుమతించరు.
- పోర్టు ఏరియాలోని వేంకటేశ్వర గుడి నుంచి రోజ్‌హిల్స్ వైపు కూడా వాహనాలు అనుమతించరు.
- ద్విచక్ర వాహన చోదకులు తమ వాహనాలను కృష్ణథియేటర్, పాత రైల్వేస్టేషన్ స్థలం వద్ద పార్కింగ్ చేసుకోవాలి.
- కార్లను హార్బర్, ఓల్డ్ పోలీస్‌స్టేషన్ వెనుక ఆదాని రోడ్డులో, పోర్టు వేంకటేశ్వర గుడి వద్ద పార్కింగ్ చేసుకోవాలి.
- యాత్రికులు తీసుకు వచ్చిన బస్సులు కాన్వెంట్ జంక్షన నుంచి పోర్టు ఆర్చ్‌లో నిర్దేశించిన స్థలంలో పార్కింగ్ చేసుకోవాలి.

పలు రైళ్ల రద్దు, మరికొన్ని దారి మళ్లింపు

తాటిచెట్లపాలెం : కాజీపేట-కొండాపల్లి సెక్షన్ వరంగల్, విజయవాడ-గూడూరు సెక్షన్ ఒంగోలు, సూరెడ్డిపాలెం స్టేషన్ల పరిధిలో జరుగుతున్న మూడో లైన్ నిర్మాణానికి సంబంధించిన ప్రి నాన్ ఇంటర్‌లాకింగ్, ఇంటర్‌లాకింగ్ పనుల నిమిత్తం విశాఖపట్నం మీదుగా ఈ మార్గంలో ప్రయాణించే పలు రైళ్లు ఆయా తేదీల్లో రద్దు చేస్తున్నట్లు, మరికొన్ని దారి మళ్లిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం త్రిపాఠి తెలిపారు. ఈనెల 5,6,8,9,11,12,13,15,16,18,19 తేదీల్లో తిరుపతి-పూరీ(17480) ఎక్స్‌ప్రెస్, 7,8,10,11,12,14,15,17,18,20,21 తేదీల్లో పూరీ-తిరుపతి (17479) ఎక్స్‌ప్రెస్, 7,10,14,17 తేదీల్లో తిరుపతి-బిలాస్‌పూర్(17482) ఎక్స్‌ప్రెస్, 9,12,16,19 తేదీల్లో బిలాస్‌పూర్ -తిరుపతి (17481)ఎక్స్‌ప్రెస్, 10,17 తేదీల్లో తిరుపతి-విశాఖపట్నం (22708) డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, 11,18 తేదీల్లో విశాఖపట్నం-తిరుపతి (22707)డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, 11,18 తేదీల్లో విశాఖపట్నం-ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ (22869) ఎక్స్‌ప్రెస్, 12, 19 తేదీల్లో ఎంజీఆర్ చెన్నై సెంట్రల్ -విశాఖపట్నం(22870) ఎక్స్‌ప్రెస్, 11,18 తేదీల్లో విశాఖపట్నం-తిరుపతి (08583)స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 12,19 తేదీల్లో తిరుపతి-విశాఖపట్నం (08584)స్పెషల్ ఎక్స్‌ప్రెస్, 9,16 తేదీల్లో హౌరా-ఎర్నాకుళం (22877)ఎక్స్‌ప్రెస్, 11,18 తేదీల్లో ఎర్నాకుళం-హౌరా (22878)ఎక్స్‌ప్రెస్, 13,20 తేదీల్లో తాంబరం-సంత్రగచ్చి (22842)ఎక్స్‌ప్రెస్, 11,18 తేదీల్లో సంత్రగచ్చి -తాంబరం (22841)ఎక్స్‌ప్రెస్, 15న హౌరా-మైసూరు (22817) ఎక్స్‌ప్రెస్, 17న మైసూరు-హౌరా(22818) ఎక్స్‌ప్రెస్, 15న సంత్రగచ్చి-ఎంజీఆర్‌చెన్నై సెంట్రల్ (22807) ఎక్స్‌ప్రెస్, 17న ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-సంత్రగచ్చి (22808) ఎక్స్‌ప్రెస్, 7,14 తేదీల్లో టాటానగర్-యశ్వంత్‌పూర్(18111) ఎక్స్‌ప్రెస్, 10, 17 తేదీల్లో యశ్వంత్‌పూర్-టాటానగర్(18112) ఎక్స్‌ప్రెస్, 13న షాలిమర్-సికింద్రాబాద్(22849) ఎక్స్‌ప్రెస్, 15న సికింద్రాబాద్-షాలిమర్(22850) ఎక్స్‌ప్రెస్‌లు రద్దయ్యాయి. భద్రతాపనుల నిమిత్తం ఈ నెల 16,17 తేదీల్లో విశాఖ-మహబూబ్‌నగర్(12861) ఎక్స్‌ప్రెస్, 17,18 తేదీల్లో మహబూబ్‌నగర్-విశాఖ(12862) ఎక్స్‌ప్రెస్ రద్దు చేశారు.

దారి మళ్లించిన రైళ్లు

ఈ రైళ్లు వయా పగిడిపల్లి-గుంటూరు-విజయవాడ మీదుగా రాకపోకలు సాగిస్తాయి.

ఈనెల 16,17 తేదీల్లో షాలిమార్-హైదరాబాద్ (18045)ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 17, 18 తేదీల్లో హైదరాబాద్-షాలిమర్ (18046)ఈస్ట్‌కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 6, 7 తేదీలతోపాటు 9 నుంచి 17వ తేదీ వరకు విశాఖపట్నం-లోకమాన్య తిలక్ టెర్మినస్ (18519) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్, 10 నుంచి 18వ తేదీ వరకు లోకమాన్యతిలక్ టెర్మినస్- విశాఖపట్నం (18520) ఎల్టీటీ ఎక్స్‌ప్రెస్, 16, 17 తేదీల్లో భువనేశ్వర్-ముంబయి (11020)కోణార్క్ ఎక్స్‌ప్రెస్, 16,17 తేదీల్లో ముంబయి-భువనేశ్వర్(11019) కోణార్క్ ఎక్స్‌ప్రెస్.

క్లుప్తంగా

ఓటరు నమోదు గడువు 9

అనకాపల్లిటౌన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో 18 ఏళ్ల నిండిన యువతీ, యువకులు ఓటు హక్కు నమోదుకు ఈ నెల 9లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆర్డీవో ఏజీ చిన్నికృష్ణ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్నికల కమిషనర్, ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త ఓటర్ నమోదు, మార్పులు చేర్పులపై బీఎల్వోలతో విస్తృత ప్రచారం చేస్తున్నామన్నారు. వచ్చే ఏడాది జనవరి 5 తర్వాత పూర్తి ఓటర్ జాబితాను ప్రభుత్వం విడుదల చేయనుందన్నారు.

8 మందికి ఐవోఎల్ శస్త్ర చికిత్సలు



కంటిపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ మల్లేశ్వరరావు

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం రోటరీ కంటి ఆస్పత్రిలో మంగళవారం ఉచితంగా 8 మందికి ఐవోఎల్ శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు ఆస్పత్రి చైర్మన్ రవిరామ్‌జవహర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సోమవారం ఆస్పత్రి ఆవరణలో 24 మందికి కంటి పరీక్షలు నిర్వహించగా, అందులో 8 మందిని ఆపరేషన్లకు ఎంపిక చేశామన్నారు. ఆపరేషన్ చేయించుకున్న రోగులకు ఐదురోజులు ఆస్పత్రిలో వసతి, సరిపడా మందులు, ఆహారం ఉచితంగా అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యుడు కె.మల్లేశ్వరరావు, వైద్య సహాయకురాలు పి.దేవి, రోగులు పాల్గొన్నారు.

వరి రైతులు జాగ్రత్తలు తీసుకోవాలి

అనకాపల్లిటౌన్: మిచాంగ్ తుపాను కారణంగా వరి పంట నష్టపోకుండా తగు చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్ పీవీకే జగన్నాథరావు తెలిపారు. స్థానిక ఆర్‌ఏఆర్ఎస్‌లోని తమ కార్యాలయంలో మంగళవారం శాస్త్రవేత్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొలాల్లో నిలిచిన వర్షపు నీటిని తొలగించి, పనలు తడిచి ఉంటే గింజ రంగు మారకుండా, మొలకెత్తకుండా ఉండేందుకు లీటరు నీటిలో 5 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేయాలన్నారు. ఎకరాకు 20 కిలోల ఉప్పును సరిపడా నీటిలో పిచికారీ చేసి పనలపై జల్లుకోవాలన్నారు. విత్తనం కొరకు జనుము జల్లుకున్నట్లైతే లాభదాయకంగా ఉంటుందన్నారు. విత్తనాలు కావలసిన రైతులు కిలో రూ.70 చొప్పున స్థానిక కార్యాలయంలో కొనుగోలు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సీహెచ్ ముకుందరావు, ఎంబీజీఎస్ కుమారి, ఆదిలక్ష్మి, విశాలాక్షి, శిరీష, చంద్రశేఖర్, అలివేణి పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు మంగళవారం 1,395 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,900	4,210
రెండో రకం	3,730	4,010
మూడోరకం	3,400	3,720

అనకాపల్లి సినిమాలు

ఆదికేశవ	: రాజా
కాలింగ్ సహస్ర	: సత్యనారాయణస్క్రీన్-1
బ్రీత్(వైద్యో నారాయణో హరి)మార్నింగ్ షో	
విక్రమ్ రాథోడ్	: సత్యనారాయణస్క్రీన్-2
ఆనిమల్	: షిర్డిసాయి
కోటబొమ్మాళి	: పర్తిసాయి
-------	: వెంకటేశ్వర
సౌండ్ పార్టీ	: శ్రీసత్య
మంగళవారం	: రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 36 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-9 యూనిట్లు, బీ నెగిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-20 యూనిట్లు, ఏబీ పాజిటివ్-4 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు టెక్నిషియన్ యు.లోకేష్(9703619706) నంబరును సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా మంగళవారం 311 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 169 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.



మూలపేట వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న దొంగ గెడ్డ



తాళ్లపాలెం వద్ద పోలవరం కాలువలో చేరిన వరద నీరు



నీట మునిగిన కశింకోట పీహెచ్‌సీ రోడ్డు



చెరువులా మారిన కశింకోట మండల పరిషత్ కార్యాలయం

ముంచెత్తిన మిచాంగ్

మిచాంగ్ తుపాను తాకిడి నియోజకవర్గంపై గట్టి ప్రభావాన్నే చూపింది. రోడ్లు, కాలువలు ఏకమయ్యాయి. వాగులు, వంకలు, గెడ్డలు పొంగి పొర్లాయి. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఆరుగాలం శ్రమించి పండించిన పంట చేతికందే సమయంలో నీట ముంపునకు గురయింది. ఇప్పటితో వర్షం ఆగిపోతే కాస్త పర్లేదు గానీ.. లేకుండా రైతులకు నష్టం తప్పదని అధికారులు చెప్తున్నారు.

- లోతట్టు ప్రాంతాలు జలమయం
- నీట మునిగిన వరి పంట

అనకాపల్లిటౌన్: మిచాంగ్ తుపాను కారణంగా పట్టణ, మండలంలోని లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఎక్కడికక్కడ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా ప్రభుత్వ పాఠశాలలకు సెలవులు ప్రకటించారు. మండలస్థాయి అధికారులు ఎక్కడా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అప్రమత్తమయ్యారు. ఇప్పటికే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గజ ఈతగాళ్లు, విద్యుత్‌శాఖ సిబ్బంది, రహదారులపై చెట్లు విరిగిపడినట్లయితే తొలగించేందుకు కూలీలను సిద్ధం చేశారు. మండలంలో కొన్ని ప్రాంతాల్లో వరిపొలాలు నీటమునిగాయి. ఇప్పటి వరకు 26.4 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం వాతావరణ విభాగం శాస్త్రవేత్తలు వెల్లడించారు. పట్టణ పరిధిలో విజయరామరాజుపేట రైల్వే అండర్ బ్రిడ్జి కింద వర్షపు నీరు చేరడంతో జీవీఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు వర్షపు నీటిని తొలగించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆర్టీసీకాంప్లెక్స్ ప్లాట్‌ఫాంతోపాటు డిపో గ్యారేజీ, దుకాణాల్లోకి వర్షపునీరు చొచ్చుకుపోవడంతో ప్రయాణికులు, వ్యాపారులు, విధులకు హాజరయ్యే ఉద్యోగులు, ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గవరపాలెం పరమేశ్వరిపార్కు సెంటర్‌లో వర్షపు నీరు నిలిచిపోవడంతో పాదచారులు, ప్రయాణికులు అగచాట్లుపడ్డారు. రైల్వేశాఖ అధికారులు పలు రైళ్లు రద్దు చేయడంతో ప్రయాణికులు బస్సులను ఆశ్రయించాల్సి వచ్చింది. మండలంలో సత్యనారాయణపురం పంచాయతీ మూలపేట గ్రామానికి వెళ్లే రహదారిలో దొంగగెడ్డ పరవళ్లు తొక్కుతోంది. గెడ్డను దాటేందుకు సాహసించలేక ప్రమాదమని తెలిసినా పలువురు గ్రామస్తులు రైల్వే పట్టాలపై కాలినడకన ముందుకు సాగారు.

కశింకోట: మిచాంగ్ తుపాను ప్రభావంతో మండలంలోని పలు గ్రామాల్లో రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరి పొలాలు నీట మునిగాయి. కశింకోట, ఏనుగుతుని, తాళ్లపాలెం, చింతలపాలెం, నరసింగబిల్లి, నూతలగుంటపాలెం, ఏఎస్ పేట, సోమవరం, గొబ్బూరు, చెరకాం, అడ్డాం, జి.భీమవరం, అచ్చెర్ల, ఉగ్గినపాలెం, జమాదులపాలెం, వెదురుపర్తి తదితర గ్రామాల్లో పండి వరి చేలు నేల కొరిగి, నీట మునిగాయి. దీంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. మండలంలో 92 హెక్టార్లలో పంట నీటి మునిగినట్లు మండల వ్యవసాయ అధికారి ఎం.స్వప్న మంగళవారం తెలిపారు. ఈ మేరకు ఉన్నతాధికారులకు నివేదించినట్లు పేర్కొన్నారు. ఇంకా వర్షాలు పడుతున్నందున ముంపు పంట విస్తీర్ణం పెరిగే అవకాశాలున్నట్లు వెల్లడించారు.



తుమ్మపాలలో నేలకొరిగిన వరిచేను

- మండలంలోని తాళ్లపాలెం సంత ప్రాంతంలో తాజాగా కురిసిన భారీ వర్షాలకు నర్సీపట్నం వైపు వెళ్లే రోడ్డు దెబ్బతిని గండి పడింది. దీంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పోలవరం కాలువలో వర్షాలకు వరద నీరు చేరింది. దీంతో కాలువలో జలకళ నెలకొంది.
- కశింకోటలో మంగళవారం 10 గంటల వ్యవధిలోనే 145.8 మిల్లీ మీటర్ల అత్యధిక వర్ష పాతం నమోదయింది. ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 7 గంటల మధ్య ఈ మేరకు వర్షం కురిసినట్లు స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్దనున్న రెయిన్ గేజ్‌లో రికార్డయింది.



తాళ్లపాలెం వద్ద కురుస్తున్న వర్షం

స్తంభించిన జన జీవనం

తుపాను ప్రభావంతో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురిశాయి. మంగళవారం ఉదయం 8.30 గంటలకు 59.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదవగా, అప్పటి నుంచి సాయంత్రం 6 గంటల మధ్య ఏకంగా 76 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదయింది. సాయంత్రం సుమారు గంట పాటు భారీ వర్షం కురిసింది. దీంతో కశింకోటలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధానంగా మండల పరిషత్ కార్యాలయ ప్రాంతంలో నీరు చేరి చెరువును తలపిస్తోంది. వర్షపు నీటితో తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ నీరు చేరింది. జాతీయ రహదారి నుంచి పోలీసు స్టేషన్, పీహెచ్‌సీ, పశువుల ఆస్పత్రికి వెళ్లే రోడ్లు నీట మునిగాయి. పోలీసు స్టేషన్ ముందు జాతీయ రహదారిపై వర్షపు నీరు ఏరులా పారుతోంది. స్థానిక పంచాయతీ ప్రధాన రహదారి కూడా నీట మునిగింది. దీంతో రాకపోకలకు ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. శారదానదిలో నీటి మట్టం పెరిగింది. తాళ్లపాలెం వద్ద మామిడివాక గెడ్డ, బయ్యవరం వద్ద కొండ గెడ్డలు పొంగి ప్రవహిస్తున్నాయి.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోండి

అనకాపల్లిటౌన్: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ గొర్లి సూరిబాబు అన్నారు. మండలంలోని కోడూరు గ్రామంలో జన జాతీయ గౌరవ దినోత్సవం, వికసిత్ భారత్ సంకల్ప యాత్రను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అర్హత ఉండీ, సంక్షేమ పథకాలు అందని వ్యక్తులు ఉంటే సమీపంలోని ప్రభుత్వ అధికారులను సంప్రదించాలని సూచించారు. అంతకుముందు 2024 క్యాలండర్‌ను సంకల్పయాత్ర కేంద్ర పరిశీలకులు డాక్టర్ అనురాధ ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో ఎ.హేమంత్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ద్వారపురెడ్డి పరమేశ్వరరావు, ఎంపీడీవో కె.నరసింహారావు, వ్యవసాయశాఖ అధికారి రంగాచారి, తుమ్మపాల పీహెచ్‌సీ వైద్యురాలు వాణి జగదీశ్వరి, సర్పంచ్ శ్రీను, వివిధ ప్రభుత్వశాఖల అధికారుల, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీపీ గొర్లి సూరిబాబు, డీఎంహెచ్‌వో హేమంత్, యాత్ర పరిశీలకులు అనురాధ

వరి చేల పరిశీలనలో అధికారులు

అనకాపల్లిటౌన్: మండల పరిధిలో ఈ ఏడాది వరి 2,920 హెక్టార్లకు గాను 2,246 హెక్టార్లలో సాగు జరిగినట్లు మండల వ్యవసాయ అధికారి రంగాచారి తెలిపారు. మండలంలోని కొత్తూరు పంచాయతీ పిసినికాడలో వరి పొలాలను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మిచాంగ్ తుపానుపై రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. వర్షం తగ్గిన తరువాత పొలాల్లో నీటిని తొలగించాలని సూచించారు. సకాలంలో వర్షాల్లేక 530 హెక్టార్లలో పంటకు నష్టం వాటిల్లిందన్నారు. 85.87 హెక్టార్లలో వరికోత కోయగా, 81.74 హెక్టార్లలో పంటను రైతులు పొలాల్లో కుప్పలు వేశారని, 4.04 హెక్టార్లలో పొలంలోనే పనలు ఉన్నట్లు పేర్కొన్నారు.



పిసినికాడలో వరిపొలాన్ని పరిశీలిస్తున్న మండల వ్యవసాయశాఖ అధికారి రంగాచారి

‘ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలి’

అనకాపల్లిటౌన్: ల్యాండ్ టైటిలింగ్ చట్టాన్ని రద్దు చేయాలని అనకాపల్లి బార్ అసోసియేషన్ సీనియర్ న్యాయవాది పి.బాలగంగాధర్ తిలక్ డిమాండ్ చేశారు. స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎస్ఎస్‌వీ లక్ష్మణరావు ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ల్యాండ్ టైటిలింగ్ చట్టం అమలు జరిగితే సామాన్య ప్రజలు తీవ్రంగా నష్టపోతారని ఆవేదన వ్యక్తం చేశారు. చట్టాన్ని రద్దు చేసేవరకూ విధుల బహిష్కరణ, రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడతామన్నారు. వివాదాలను పరిష్కరించే సివిల్ కోర్టు పరిధిని రద్దుచేసి రెవెన్యూ పరిధిలో పెట్టడం అన్యాయమన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు బీవీ రమణ, ప్రధాన కార్యదర్శి ఎస్.శ్రీనివాస్, కోశాధికారి కె.సందీప్, సీనియర్ న్యాయవాదులు పీఎస్ పట్నాయక్, ఎం.జగపతి, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బాలగంగాధర్ తిలక్

భక్తిశ్రద్ధలతో కార్తీక తదియారాధన

సింహాచలం: సింహగిరిపై మంగళవారం కార్తీక తదియారాధనను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కల్యాణ మండపంలో మధ్యాహ్నం 12 నుంచి 2.30 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని దేవస్థానం అర్చకులు, అధికారులు నిర్వహించారు. దేవస్థానం ఉద్యోగులు, ట్రస్ట్‌బోర్డు సభ్యులు, భక్తులు, సింహగిరి నిర్వాసితులు స్వామివారి అన్నప్రసాదం స్వీకరించారు. ఏటా కార్తీక మాసంలో సింహగిరిపై తదియారాధన నిర్వహించడం పరిపాటిగా వస్తోందని స్థానాచార్యులు టి.పి.రాజగోపాల్ తెలిపారు. దేవస్థానం ప్రధానర్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, వైదికులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి, ఎస్‌డీసీ రామలక్ష్మి, ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, సువ్వాడ శ్రీదేవి, బయ్యవరపు రాధ, దశమంతులు రామలక్ష్మి, పెనుమత్స శ్రీదేవి వర్మ, ఈఈలు శ్రీనివాసరాజు, రాంబాబు, ఏఈ హరి, ఏఈవోలు నరసింహరాజు, పాలూరి నరసింగరావు తదితరులు పాల్గొన్నారు.



అన్నప్రసాదాన్ని స్వీకరిస్తున్న ఈవో శ్రీనివాస మూర్తి, ట్రస్ట్‌బోర్డు సభ్యులు

కళా ఉత్సవ్‌కు ఆరిపాక విద్యార్థులు

సబ్బవరం: ఈ నెల 11, 12 తేదీల్లో భీమిలి డైట్ కళాశాలలో జరగనున్న కళా ఉత్సవ్‌లో మండలంలోని ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 20 మంది విద్యార్థులు పాల్గొంటారని పాఠశాల ఆంగ్ల ఉపాధ్యాయురాలు బీవీ రామలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వీరిలో 10 మంది బాలురు, 10 మంది బాలికలు ఉన్నారన్నారు.

శాస్త్రీయ సంగీతం, జానపద సంగీతం, వివిధ వాయిద్యాలు వాయించడం, శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, 2డీ, 3డీ బొమ్మల తయారీ అంశాల మీద పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీలో మొదటి స్థానంలో నిలిచినవారు ఈ నెల 14, 15 తేదీల్లో విజయవాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. విజేతలకు నగదు, మెడల్‌తో పాటు అవార్డులు ఇస్తారని ఆమె తెలిపారు.

ఘనంగా పాశాలమ్మ ఉత్సవం

కశింకోట: మండలంలోని బయ్యవరంలో మంగళవారం రాత్రి పాశాలమ్మ అమ్మవారి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కర్రతో తయారు చేసిన గుర్రం, ఒంటె, ఏనుగు బొమ్మలపై గ్రామ పెద్దలను సంప్రదాయంగా ఊరేగించారు. పాశాలమ్మ ఆలయాన్ని ప్రజలు దర్శించి పూజలు చేశారు. అనకాపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ గొల్లవిల్లి జయ, ఎంపీటీసీ సభ్యుడు గొన్నా నాగసత్యనారాయణ, స్థానిక ప్రజలు ఉత్సవంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. అదనపు ఎస్ఐ జె.నాగేశ్వరరావు తమ సిబ్బందితో బందోబస్తు నిర్వహించారు.

పూడిమడక, తంతడి గ్రామాల్లో అధికారుల పర్యటన

అచ్యుతాపురం(అనకాపల్లి) : అచ్యుతాపురంలో మంగళవారం రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. ఉదయం ఎనిమిదిన్నర గంటల నుంచి మధ్యాహ్నం రెండున్నర గంటల వరకూ నలభై మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. మండలంలోని తీర ప్రాంత గ్రామలైన పూడిమడక, తంతడి గ్రామాలపై అధికారులు దృష్టి సారించారు. ఆర్డీవో చిన్నికృష్ణ, తహసీల్దార్ శ్రీనివాస్, సీఐ మురళీరావు, ఎస్ఐ సన్యాసినాయుడు పూడిమడక తీరంలో పర్యటించారు. తంతడిలో ఆర్ఐ కుమార్‌తో పాటు పలువురు అధికారులు పర్యటించారు. తుపాన్ షెల్టర్లను ఏర్పాటు చేశారు. కొండకర్ల ఆవలో నీటి ఉధృతి పెరగడంతో హరిపాలెం-అందలాపల్లి ప్రధాన రెగ్యులేటర్ వద్ద గేట్లను ఎత్తివేశారు.

తుపాను సహాయక పనుల్లో వైఎస్సార్‌సీపీ శ్రేణులు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో పలుచోట్ల వర్షపునీరు నిలిచిపోయింది. ప్రజల ఇబ్బందులు గుర్తించిన వైఎస్సార్‌సీపీ నేతలు ఉప సర్పంచ్ జగన్, సచివాలయ కన్వీనర్ రామభద్రరావు చొరవ చూపి మంగళవారం రాత్రి కాలువల్లో పిచ్చి మొక్కల తొలగింపు పనులు చేపట్టారు.

‘వై ఏపీ నీడ్స్ జగన్’ నేడు

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం-2 సచివాలయంలో బుధవారం మధ్యాహ్నం 3 గంటలకు వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీపీ కలగా లక్ష్మి, ఎంపీడీవో వీవీ రవికుమార్‌లు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా నాలుగున్నరేళ్ల పాలనలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సచివాలయ పరిధిలో చేపట్టిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాల లబ్ధి వివరాలతో రూపొందించిన డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించి, పార్టీ జెండాను ఎగురవేయనున్నట్లు పేర్కొన్నారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు, అధికారులు, సచివాలయ సిబ్బంది హాజరు కావాల్సిందిగా కోరారు.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దివ్యాంగుడు వీర్రాజుకు పింఛన్ అందిస్తున్న వలంటీర్ వినయ్

శభాష్ వలంటీర్



విశాఖ కేజీహెచ్‌లో అప్పారావుతో వేలిముద్ర వేయిస్తున్న వలంటీర్ బుజ్జిబాబు

అనకాపల్లిటౌన్: మిచాంగ్ తుపానును లెక్కచేయకుండా వలంటీర్ వినయ్ విశాఖలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దివ్యాంగుడు దుగ్గిరాల వీర్రాజుకు పింఛన్ అందించి తన నిబద్ధతను చాటుకున్నారు. మండలంలో కొత్తూరు-1 పంచాయతీ పరిధిలో నివసిస్తున్న దివ్యాంగుడు వీర్రాజు నోటి సంబంధిత వ్యాధితో 20 రోజులుగా విశాఖలోని మారికవలస గాయత్రి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ నెల పింఛన్ పంపిణీ సమయంలో విషయం తెలుసుకున్న వలంటీర్ తన సొంత ఖర్చుతో విశాఖ వెళ్లి, ఆస్పత్రిలో ఉన్న వీర్రాజుకు దివ్యాంగ పింఛన్ అందించారు. కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. వలంటీర్‌కు, ప్రభుత్వానికి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

యలమంచిలి (అనకాపల్లి రూరల్): దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వ్యక్తి వద్దకే వెళ్లి పింఛను అందజేసి తన సేవాభావాన్ని చాటుకున్నాడొక వలంటీర్. పురుషోత్తపురం గ్రామానికి చెందిన నందిక అప్పారావు ఇటీవల పక్షవాతానికి గురయ్యాడు. 15 రోజులుగా అప్పారావు విశాఖలోని కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నాడు. అతను ఈ నెల పింఛను అందుకోలేకపోవడంతో గ్రామ వలంటీర్ తమ్మంగి బుజ్జిబాబు తన సొంత ఖర్చులతో మంగళవారం విశాఖ కేజీహెచ్‌కు వెళ్లాడు. ఆస్పతిరలో చికిత్స పొందుతున్న అప్పారావు నుంచి వేలిముద్ర సేకరించి అక్కడే పింఛన్ సొమ్ము అందజేశాడు. వలంటీర్ సేవాగుణాన్ని వైస్ ఎంపీపీ రాజాన శేషు, సర్పంచ్ రాజాన సునీత ప్రశంసించారు.

బోసిపోయిన వారపు సంత



ఖాళీగా దర్శనమిస్తున్న పరవాడ వారపు సంత

పరవాడ: తుపాను కారణంగా రెండు రోజులుగా ఎడతెరిపిలేకుండా కురుస్తున్న వర్షాలకు మండల నలుమూలల నుంచి వినియోగదారులు రాకపోవడంతో పరవాడలో మంగళవారం నిర్వహించిన వారపు సంత బోసిపోయింది. ఉదయం 6 నుంచి వినియోగదారులతో రద్దీగా ఉండే రోడ్లు, సంత ప్రదేశం ఖాళీగా కనిపించాయి. వర్షం లేకపోతే సంతలో రూ.లక్షల వ్యాపారం జరిగేది. వర్షం కారణంగా మంగళవారం రూ.వేలల్లో కూడా వ్యాపార లావాదేవీలు జరగలేదని దుకాణదారులు వాపోయారు. జోరుగా కురిసిన వర్షానికి సరకులు తడిసిపోకుండా వ్యాపారులు జాగ్రత్తలు తీసుకున్నారు. రోజంతా కురిసిన వర్షంతో వ్యాపారాలు లేక సాయంత్రం ఉసూరుమంటూ వ్యాపారులు ఇళ్ల దారిపట్టారు.

ప్రైవేటీకరణతో కార్మికులకు అన్యాయం



దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: దేశ ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వ రంగ సంస్థలే ఆధారమని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. అటువంటి సంస్థలను ప్రైవేటీకరణ చేయడం వల్ల దేశ ఆర్థిక వ్యవస్థ పతనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో చేపట్టిన నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 1027వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలో సంస్థకు చెందిన ఎల్ఎంఎంఎం, ఎస్‌బీఎం విభాగాల కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కార్మిక వర్గాన్ని, నిర్వాసితులను, నిరుద్యోగులను నడిరోడ్డుపై పడేసే విధంగా కేంద్ర ప్రభుత్వం కుట్రలు చేస్తోందన్నారు. ఈ కుట్రలను ఉద్యమాల ద్వారా ఎదుర్కొంటామన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.